# మంచు తరకలు

జె.శ్రీదేవి [న్యూయార్క్]

ఏ రెండు మంచు తరకలూ ఒక్కలా ఉండవని ఇంగ్లీషు సామెత. ఎంతమటుకు నిజమో మరి.

*** *** ***

"ఏమండీ..."

"ఊ...."

"ఏమండీ.... లేవండీ..."

"ఏమిటోయ్, ఆదివారం కూడా పొద్దున్నే హడావుడి పెడతావ్!"

"మంచు పడుతోందండీ ఎంచక్కా."

"మంచు పడుతుంటే నేను లేవట మెందుకోయ్."

"భలే ముచ్చటగా ఉందండీ. ఎం తందంగా ఉందో, రండీ చూద్దురు గానీ..."

"స్నోయే కదోయ్, ఇంతకు ముందు చూశాన్లే. వెచ్చగా కావలించుకొని పడుకోక ఆదివారం పొద్దు ఇదేం గోలోయ్?"

"చక్కగా గడ్డి మీద తెల్లని దుప్పటి కప్పినట్టు ఎంత బాగుందో. వెన్నెల పిండారబోసినట్లుంటుందని ఎక్కడో చదివాను. ఇట్లాగే ఉంటుంది కాబోలు."

"సర్లే, మరీ అంత ముచ్చటగా ఉంటే, ఆ కర్టె(న్) నట్లాగే తెరిచి పెట్టి ఇట్లా పక్కలో కొచ్చి పడుకొని చూడు, ఇంకా బాగుంటుంది."

".... నిజమే నండోయ్ .... ఇందుకే కాబోలు మన సినిమాల్లో హీరో హీరోయిన్లు కాశ్మీ రెళ్లి మరీ డ్యూయెట్లు పాడుకుంటారు."

"డ్యూయెట్లతో ఆపేసే ఖర్మ మన కేమిటోయ్..."

*** *** ***

వెధవ స్నో తెల్లారకుండానే మొద లయ్యింది. అయినా ఖర్మకాకపోతే ఈ దేశం కాని దేశం రావట మెందుకు, ఈ ఉద్యోగా లెందుకు? పొద్దున్నే లేచి హడావుడిగా బయలుదేరి మూడు లేయర్లు బట్ట లేసుకొని బయటకు వస్తే కారుపైన మూడంగుళాల్లెక్కన తెల్లగా పేరుకొని ఉంది వెధవ మంచు. స్నో స్క్రేపరు వెతికి పట్టుకొని అద్దాల మీద మంచు గీకేద్దా మంటే ఒకటే ఈదురుగాలి. మొహమ్మీదా, కళ్లద్దాల మీదా మంచు. క్లీన్ చేస్తున్నంత స్పీడుగా మళ్లీ అద్దమ్మీద తయారు. ఎరక్కపోయి వచ్చా నీ దేశం. అసలు మా అమ్మా నాన్న ల్ననుకోవాలి. అమ్మాయికి అమెరికా సంబంధం కుదిరిందని ఒక్కటే మురిసిపోయారుగాని ఒక్కసారన్నా ఎవరన్నా మాట వరసకన్నా చెప్పారా రోజూ పొద్దున్నే ఇన్ని అవస్థలు పడాలని.

చచ్చీ చెడీ స్నో అంతా స్క్రేప్ చేసుకొని కారెక్కితే చలికి బయల్దేరనని కాస్సేపు కారింజను మొరాం. ముక్కీ మూలిగీ కారు స్టార్టు జేసి ఇంజను వేడెక్కే దాకా ఆగి గేరు మారిస్తే రాత్రంతా పడ్డ మంచు టైర్లకడ్డం పడి కారు కదల్నంటుంది. సమయానికి పక్క అపార్ట్‌మెంటాయన వర్క్‌కి వెళ్తున్నవాడు దేవుడు లాగా వచ్చి కారు తోసిపెట్టాడు గాని లేకపోతే మార్నింగ్ రౌండ్స్‌కి ఇక వెళ్లినట్లే. అసలే మా అటెండింగ్ చండశాసనుడు. 'ఏం తల్లీ, అమెరికా ఎందు కొచ్చావ'న్నట్లు మాట్లాడ్డం మొద లెడతాడు.

కారు కదిలించి పార్కింగ్ లాట్ వదిలి రోడ్డెక్కుతున్నానన్న మాటేగాని, గుండె గొంతుకలోనే ఉంది. అసలు రోడ్డు మీద స్నో ఉంటేనే నాకు డ్రైవ్ చేయడానికి భయం. అట్లాంటిది స్నో పడుతుండగా డ్రైవ్ చేయాల్సొచ్చిం దివ్వాళ. ఇదే వీకెండయితే శుభ్రంగా ఆయనే డ్రైవ్ చేసేవారు. ఊరికి ఆయన ఉద్యోగ మొకవేపు, నా రెసిడెన్సీ ఇంకో వేపూ నాయె.... గాలికి మంచు తెరలు తెరలుగా విండ్‌షీల్డ్ మీద క్కొట్టుకొని వస్తూంది. వైపర్లెంత వేగంగా పని చేస్తున్నా అద్ద మంతా మసికలు మసికలుగా అయిపోయి కష్టంగా ఉంది. రోడ్డంతా మంచుతో రొచ్చు రొచ్చయిపోయి లేన్ మార్కింగ్సేమీ కనిపించడం లేదు - ముందు కారులు పోయిన చారలు తప్ప. వాటిల్లోనే నెమ్మదిగా పోదామంటే వెనక వాడేమిటో హడావుడిగా మీద మీద కొచ్చేస్తున్నాడు. పోని నేను గూడా కొద్దిగా స్పీడు పెంచొచ్చేమోలే.... అరెరే....



కారేమి టలా పక్కకు పోతోంది... స్కిడ్డవుతున్నట్లుంది దేవుడా.... బ్రేక్ వేస్తే ఆగుతుందేమో.... అయ్యయ్యో, ఇంకా ఎక్కువయ్యింది... టేక్! ఫుట్ ఆఫ్ ది బ్రేక్! స్లో డౌన్! కంగారుపడకు. స్టీరింగ్ నెమ్మదిగా తిప్పు... హమ్మయ్య ఆగింది. గుండె దడదడా కొట్టుకొంటూంది. ఇంకా నయం. పక్క లేన్‌లో కార్లేం లేవు, లేకపోతే హాస్పిటల్‌కి రౌండ్స్‌క్కాకుండా ఎమర్జెన్సీ రూంకి వెళ్లాల్సొచ్చేది. వెనక వెధవలు హడావుడి పడితే పడనీ. నేను మాత్రం స్పీడు పెంచేది లేదు. కావాలంటే వాడే పక్క లేన్లోకి పోతాడ్లే. అటెండింగ్ తిడితే తిట్టాడ్లే. బతి కుంటే బలుసాకు తినొచ్చు... హమ్మయ్య, హాస్పిటల్ వచ్చేసింది... ఖర్మ పార్కింగ్ లాట్లు క్లీన్ జేసినట్లు లేరు. కార్లు ఇష్ట మొచ్చినట్లు పెట్టేశా రందరూనూ. బిల్డింగ్ దగ్గర్లో పార్కింగ్ ప్రశ్నే లేదు. ఈ స్నో రొచ్చులో బట్ట లన్నీ మురి కవుతూ ఈడ్చుకొంటూ వెళ్లాలి.

ఛీఛీ.... వెధవ స్నో... దరిద్రపు స్నో

*** *** ***

"మామ్, ఇట్స్ స్నోయింగొబ్బైడ్. కె నై గో ఔటండ్ ప్లే?"

"వద్దమ్మా జలుబు చేస్తుంది."

"మామ్! ఎవ్రీ బడీ ఈస్ ప్లేయింగౌట్డోర్. ఐ వాంట్టూ గో!"

"నా మాట వినమ్మా, నీకు జలుబు తగ్గింకా వారం కూడా కాలేదు."

"ఐ డోంట్కేర్, ఐ వాంట్టూ గో ఔటండ్ ప్లే! యూ నెవర్లెట్మీ ప్లేయిందస్నో!"

"సరే చావు. మేక్ ష్యూర్ యూ కవర్యువర్సెల్ఫ్. అదిగో క్యాపెట్టుకోలా. వేరా ర్యువర్ మిట్టెన్స్?"

బయట మంచి హుషారుగా ఆడుకొంటూంది పాప పక్కింటి పిల్లలతో. స్లెడ్డెక్కి భయం లేకుండా మంచులో జారిపోతూంది. చిన్న చిన్న పిల్లలు వాళ్లకి డబుల్సైజు బట్ట లేసుకొని గుమ్మటాల్లా పడుతూ లేస్తూ ముచ్చటగా కేరింతలు కొడుతూ ఆడుకొంటున్నారు. స్నో మాన్ చేద్దామన్న ఐడియా వచ్చి నట్లుందెవరికో. తెగ హడావుడి మొదలయ్యింది. పాప మిట్టెన్స్ తీసేసి ఆడుతోంది. మళ్లీ జలుబు మొద లవ్వదు గదా. మళ్లా ఇయర్ ఇన్ఫెక్షన్ వచ్చిందంటే చచ్చామే. స్నోమాన్‌కి ఎవరో బొగ్గు ముక్కలు కాబోలు తెచ్చి పెట్టారు, కళ్లకి, కోటు బొత్తాలకి బదులు. పక్కింటి వాళ్ల జాన్ కారట్టొకటి తీసుకొచ్చి స్నోమాన్‌కి ముక్కు తయారు చేశాడు. ఇంకో పిల్లా డెవరో క్యాప్పూ, మఫ్లరూ పెడుతున్నాడు. ఏ మాట కామాటే, దే ఆల్ సీంటుబీ హావింగేలాటాఫ్ఫన్. పిల్లల గంతులూ, కేరింతలూ, కోలాహలం... చూడ్డానికి చక్కగా, ఆనందంగా ఉంది.

*** *** ***

మంచు విపరీతంగా పడుతోంది. రాత్రెప్పుడు మొద లయ్యిందో తెల్లారే సరికే ఎటు చూసినా తెల్లగా నిండిపోయింది. నాలుగయిదు అంగుళాలన్నా ఉండుంటుంది. పాల సముద్రం చూడ్డానికి ఇట్లాగే ఉంటుంది కాబోలు. తెల్లటి మంచు మధ్యలో వీపింగ్ విల్లో చెట్టు ఆకులన్నీ రాలిపోయి కొమ్మలు పరుచుకొని వూడలు వేళ్లాడుతూ పాల సముద్రంలో ఆదిశేషుడిలానే

ఉంది. దూరంగా వెనకింటి వాళ్ల పిల్లలు బాక్‌యార్డ్‌లో ఆడుకొంటున్నారు. వాళ్ల నీలవు రంగు నియాన్ వింటర్ జాకెట్లు తెల్లని స్నో మీద జిగేల్ మని మెరుస్తున్నాయి. పెద్ద పెద్ద రేకలతో మంచు ముద్దలు ముద్దలుగా గాలికి సుళ్లు తిరుగుతూ బద్ధకంగా పడుతోంది. బయటంత మంచు కురుస్తున్న సంగతి సన్ రూంలో ట్రాపికల్ ప్లాంట్స్ కేమీ పట్టినట్లు లేదు. ఒకటో రెండో మల్లె మొక్కలు ఇంకా పూలు పూస్తూనే ఉన్నాయి. దూరంగా ఫామిలీ రూంనించి సన్నగా వినిపిస్తున్న సంగీతం వింటూ ఆ మల్లెపూల వాసన మధ్య విక్కర్ రిక్లైనర్లో మెత్తని దిండు మీద వెనక్కి వాలి కూర్చొని కాళ్లు సెంటర్ టేబుల్ మీదకి చాపుకొని రెండు చేతుల మధ్యలో గట్టిగా పట్టుకొన్న వెచ్చని కప్పు నుంచి వస్తున్న ఆవిర్లు ముఖానికి తగుల్తూ వేడి వేడి కాఫీ నెమ్మదిగా గొంతులో జారుతుండగా అద్దాల లవతలి ఆ సౌందర్యా న్నాస్వాదిస్తూంటే ఎంతో మత్తుగా మనోహరంగా ఉంది. ఈవాళ బయటకు వెళ్లాల్సిన అవసరం లేదన్న ఆలోచన ఇంకా హాయిగా ఉంది. .... ది సీజ్ హెవెన్లీ...

*** *** ***

"మామ్! ఐ హేట్దిస్ వైట్ స్టఫ్!"

"అదేమిట్రా, ఉత్తప్పు డల్లా స్నో పడటం లేదని ఏడుస్తూ ఉంటావు గదరా!"

"వెల్, ఐ లైక్ స్నో బట్ఐ హేట్ క్లీనింగ్ దిస్ డ్రైవ్వే."

"అట్లా అంటే ఎట్లారా, నువ్వు హెల్ప్ చేయకపోతే నా న్నొక్కరే ఎంతసేపని స్నో షవెల్ చేస్తారు. బాబ్బాబు, కొద్దిగా హెల్ప్ చేయరా డాడీకి."

పాపం, ఇండియాలో ఉన్నన్నాళ్లూ ఈయన స్వంత చేత్తో ఒక్క పని చేసిన పాపాన పోలేదు. ఆఖరికి మంచి నీళ్లన్నా ఒక్కసారయినా స్వయంగా ముంచుకొని తాగుతుండగా చూసిన గుర్తు లేదు. అట్లాంటిది ఈ గడ్డు చలిలో రెండు గంటల నించి షవెల్ తీసుకొని డ్రైవ్వే మీద స్నోతో కుస్తీ పడుతున్నారు. పోన్లే వదిలేద్దామా అంటే ఎక్కడ గడ్డ కడుతుందో అని భయం. దానికితోడు ఇవాళ ఇంట్లో పార్టీ పెట్టుకున్నామాయె. వచ్చే గెస్ట్‌లంతా కార్లు పార్క్ చేసుకోవాలి గదా. పైగా వాళ్లల్లో ఎవ రన్నా కాలు జారి పడ్డారంటే లేనిపోని గొడవ. చచ్చినంత ప నవుతుంది. అన్నట్లు ఈ మధ్య ఎవళ్లో అంటుంటే విన్నాను ఎంత మటుకు నిజమో గాని. బాత్రూంలో జారి కాలు విరగ్గొట్టుకొని హోస్ట్‌ని స్యూ చేశారట మన తెలుగు వాళ్లలోనే.

ఇవాళ పార్టీ సంగతి తల్చుకొంటేనే భయమేస్తోంది. ఈ స్నో పుణ్యమా అని బయట లాస్ట్ మినిట్ షాపింగ్‌కి వీల్లేకుండా పోయింది. ఇంట్లో ఉన్న వాటితోనే సరిపెట్టుకోవాలి. పొద్దంతా హూనం చేసుకొని ఇల్లు క్లీన్ చేసి పెట్టుకొంటే పిల్లలు బయట నుంచి వచ్చినప్పు డల్లా వాళ్ల మాస్‌తో పాటు ఇంటి నిండా మంచూ, తడీ, రొచ్చూ. చేసిన ఫలితం కూడా లేకుండా పోయింది. ఇక సాయంత్రం పార్టీ టైంకి ఎంత మె స్సవుతుందో ఏమో. వీటన్నిటికీ తోడు ఈ ఫోను గో లొక్కటి.

"హలో, ఎవరూ మాలతి గారా.... బాగున్నారా... డైరెక్ష న్లిద్దామని , నేనే కాల్ చేద్దామనుకొంటున్నాను... అదేమిటీ రావటం కాన్సిల్ చేసుకొంటున్నారా... అయ్యో... అవున్లేండి మీరు చాలా దూరం డ్రైవ్ చేయాలి పాపం... అయినా ట్రై చేయకూడదూ... సర్లెండి, ఐ అండర్‌స్టాండ్.... మీ రేమాత్రం వీలైనా ట్రై చేయండి... బై."

ఇంకా ఎంత మంది కాన్సిల్ చేస్తారో ఏమిటో. ఈ వండిన వన్నీ ఎవళ్లు తింటారు? చచ్చి చెడీ డే



ఆఫ్ తీసుకుని మరీ వంటలు చేశాను. మరీ ఎక్కువ మిగిలా యంటే ఫ్రిజ్ కూడా పట్టదు.

దరిద్రపు స్నో ఇవాళే పడాలా!

*** *** ***

ఏ రెండు మంచు తరకలూ ఒక్కలా ఉండవని ఇంగ్లీషు సామెత. నిజమే కాబోలు. ●

## సంగతులు - సందర్భాలు - ౨౪
## జీవిత సమ్మోహిని!
### సేకరణ : మన్నవ గిరిధరరావు

అమెరికా, ఐరోపాలలో పర్యటించిన పిదప స్వామి వివేకానందుడు 1897లో మాతృభూమికి తిరిగి వచ్చారు. కొలంబో నుండి ఆల్మోరా వరకు పర్యటించి తన ప్రసంగాలలో భారత దేశ సముద్ధరణకు కార్య పద్ధతిని సూచించారు.

ఒకమారు స్వామీజీ మిత్రులతో మాట్లాడుతూ, "అమెరికాలో నా జీవిత సమ్మోహిని ఉన్నది" అన్నారు.

ఇది విన్న ఒక మహిళ సరదాగా ఆయనను కొంచెం ఉడికిద్దామని, "ఆమె ఎవరు స్వామీ!" అని అడిగింది.

అందు కాయన పకపకా నవ్వి "ఆమె ఎవరో స్త్రీ కాదు, తల్లీ! ఆ దేశీయులకు గల సంఘటనా నైపుణ్యం [Organising ability] " అన్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఒక సంస్థను నిర్మించడానికి చేపట్టిన కార్యాన్ని మధ్యలో నిలిపివేయకుండా పకడ్బందీగా నిర్వహించడానికి ఎంతగా కృషి చేస్తారో ఆయన పరిశీలించారు. వారు ఇలా అన్నారు :

"భారతదేశంలో సమష్టి ప్రయత్నాలన్నీ ఒకే ఒక దుర్లక్షణం యొక్క బరువుతో కుంగిపోతున్నాయి. మన మిప్పటికీ వ్యవహార నియమాలను పాటించడంలో శ్రద్ధ వహించడంలేదు. ఒకందుకు ఉద్దేశింపబడిన ధనాన్ని దానికి తప్ప మరొకదానికి ఎంత మంచిపనికైనా ఉపయోగించకూడదు.

"ఇప్పుడు భారతదేశంలో ముగ్గురు మనుషులు అయిదు నిముషాలసేపు కలిసి పనిచేయలేరు. ప్రతివాడూ పదవి కోసం పోట్లాడుతాడు. అట్టి స్థితిలో త్వరలోనే సంస్థ అంతరిస్తుంది. ఈ పరిస్థితి మారాలి.

"మానవ జాతికి మేలు చేయదలచినవారు తమ సుఖదుఃఖాలూ, పేరు ప్రతిష్ఠలూ, లాభాలూ, ప్రయోజనాలూ - అన్నీ కట్టకట్టి సముద్రంలో పారవేసి నిర్మల చిత్తులై కార్యరంగంలో అడుగుపెట్టాలి.

"ఇక్కడ ప్రతివాడికీ నాయకత్వం కావాలి. ఎవ్వరూ ఆజ్ఞలను అమలుపరచడు. మహాకార్యాలను సాధించాలంటే నాయకుని ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించాలి.

"మనము చేతులు ముడుచుకుని కూర్చుంటాము గానీ, ఏ పనీ చెయ్యము. ఎవరైనా చేస్తుంటే తప్పులు వెదికి అవహేళన చేస్తాము. ఈ దోషము వలన జాతి పతనావస్థకు వచ్చింది.

"ఎవరి ఉత్సాహాన్నయినా చల్లార్చకండి. విమర్శన పూర్తిగా మానివేయండి. పరస్పర విమర్శయే సర్వానర్థాలకు దారితీస్తుంది. సంస్థల విచ్ఛిత్తికి అదే మూలకారణం.

"అనర్థానికి మూలహేతువు పక్షపాతమే. ఏ ఒక్కడినైనా మరొకడికంటె ఎక్కువగా ప్రేమించావో, భవిష్యత్తులో ఇబ్బందులకు బీజము నాటినట్లే. తన అనుచరులను తారతమ్య భావంతో ప్రేమించేవాడు ఎన్నడూ నాయకుడు కాలేడు.

"నీ దగ్గర కెవరైనా వచ్చి తోటి కార్యకర్తల గురించి చెడు చెప్పడానికి పూనుకుంటే ఎన్నడూ వినిపించుకోవద్దు. పూర్తిగా నిరాకరించి పంపివేయి. ఊరికే వినడం కూడా మహాపాపమే!

"అందరి లోపాలను క్షమించడం నేర్చుకో. కోట్ల కొలది దోషాలను క్షమించు. నిస్వార్థంగా నీవు అందరినీ ప్రేమిస్తుంటే క్రమక్రమంగా వాళ్లందరూ ఒకరి నొకరు ప్రేమతో మెలగుతారు."